

# సంకెళ్ళు

బి. పి. కరుణాకర్

రాత్రి తొమ్మిదిన్నర దాటింది.

హైద్రాబాద్ బస్ డిపో ట్యూబ్ లైట్ల వెలుగులో కోలాహలంగా ఉంది.

హైద్రాబాద్‌నుండి గుంటూరు వెళ్ళే బస్సు డ్రైవరు తన వాచీవంక ఒకసారి చూసుకున్నారు. హారన్ నొక్కాడు. వెనకకు తిరిగాడు

"ఏమిటోయ్ ఆలశ్యం? తొమ్మిదిన్నర దాటిపోయింది." కండక్టర్ నుద్దేశించి విసుగ్గా అన్నాడు

"ఒక పాసింజరు రావాలి గురో" అన్నాడు కండక్టరు.

"రిజర్వేషనా?"

"ఆహా"

"ఇంకెక్కడ వస్తాడు? వెళ్ళి కాస్పలు కేక ఉన్నవాళ్ళల్లో ఎవర్నో ఒకర్ని ఎక్కించు. టైం అయిపోతుంది."

కండక్టరు బస్సు దిగాడు.

అంతలో ఒక పన్నెండేళ్ళ కుర్రాడు పరుగెత్తుకుంటూవచ్చి బస్సు ఎక్కబోయాడు.

కండక్టరు ఆ కుర్రాడ్ని ఆపి "రిజర్వేషనా?" అడిగాడు.

కుర్రాడు కుడిచేతిలోని ఎయిర్‌బేగ్‌ను ఎడమచేతిలోకి మార్చుకుని తలూపాడు. అలుపు తగ్గలేదు. ముఖంమీద చెమట పట్టింది.

"టికెట్ ఏది?" అడిగాడు కండక్టరు.

చేతి మడతలో ఉంచిన టికెట్‌ను తిసి కండక్టరు చేతికి అందించాడు కుర్రాడు.

"చూశావా టైం అయిపోయింది." అని కుర్రాడితోపాటు ఎక్కి తలుపువేసి గంటకొట్టాడు కండక్టరు.

బస్సు కదిలింది.

కుర్రాడు తన సీటు వెతుక్కొని ఎయిర్ బేగ్ సీటుక్రింద పెట్టి కూర్చున్నాడు.

బస్ డిపో మలుపు తిరిగి వెళ్ళిపోయింది.

బస్సు వేగం హెచ్చింది.

కాంతారావు తన ప్రక్కనే కూర్చున్న ఆ కుర్రాడివంక పరీక్షగా చూశాడు

"ఆలస్యం అయింది. కొద్దిసేపు ఉన్నట్లయితే బస్ కదిలిపోయేది" అన్నాడు కాంతారావు.

"సిటీబస్ దొరకలేదండి" అన్నాడు కుర్రాడు.

"ఎక్కడివరకూ వెళ్ళాలి?"

"గుంటూరు—మీరు?"

"నేనూ అక్కడకే"

"గుంటూరు ఎప్పుడు చేరుతుంది?"

"రేపు ఉదయానికి......ఆరుకావచ్చు."

కుర్రాడు చిన్నగా నిట్టూర్చాడు.

హైద్రాబాద్ పొలిమేరలు చీకట్లో ఒంటరిగా నుంచుండిపోయాయి.

కిటికీల్లోగుండా చల్లటి గాలివీస్తోంది.

కుర్రాడు సీటుకు చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు. ఎంత ఆపుకుంటున్నా దుఃఖం ఆగడంలేదు. అన్నయ్య, మాలతి వదిన, అమ్మ మాటి మాటికి గుర్తుకు వస్తున్నారు. మాలతివదిన ఎంతమంచిది! మామయ్య నిజంగా కథల్లో రాక్షసుడు. అట్లానే ఉంటాడు. మామయ్యకు అన్నయ్యకూ పడదు. అందుకనే.....మాలతి వదిన అసలు ఎలా ఒప్పుకుందో? కళ్ళ నిండా నీళ్ళు తిరుగుతున్నాయి. కళ్ళు తెరిచాడు.

కాంతారావు ఆ కుర్రాడివంకే చూస్తున్నాడు.

కుర్రాడు జేబులోంచి కర్చీఫ్ తీసి కళ్ళ నీళ్ళు తుడుచుకున్నాడు.

"నీ పేరేమిటి?" అడిగాడు కాంతారావు.

"రవీంద్ర"

"చదువుకుంటున్నావా?"

రవీంద్ర తలూపాడు.

"ఎన్నో క్లాసు?"

రవీంద్ర చెప్పాడు.

"సెలవులకు గుంటూరు వెడుతున్నావా"

"కాదండీ.. ."

"మరి . . ."

"మా వదిన పెళ్ళికి ఎల్లుండే పెళ్ళి"

బస్సులో లైట్లు ఆరిపోయాయి. వాళ

# సంకెళ్లు

ముంచి నిద్రలో జోగుతున్నారు. బస్సులో పాటు వెన్నెల నిండుగా నవ్వుతూ పరుగెడుతోంది.

కాంతారావు కళ్లు మూసుకుని సీటుకు చేరగిలబడ్డాడు. మనసంతా ప్రశాంతంగా ఉంది. ఆఫీసుకు, ఫైళ్లకూ నాలెనిరోజుల పాటు దూరంగా ఉండాలి. ఆ తర్వాత తిరిగి ఆఫీసులో చేరాలి. ఈమధ్యలో.....

జేబులోంచి సిగరెట్‌తీసి వెలిగించాడు. రవీంద్ర వంక చూశాడు. కళ్లు మూసుకుని ఉన్నాయి. పెదాలు వణుకుతున్నాయి. కనుకొలుకుల్లో నీరు నిలవలేక చెంపలమీదుగా క్రిందకు జారిపోతుంది. రవీంద్రను చూస్తుంటే కాంతారావుకు తన తమ్ముడు వాని గుర్తుకు వచ్చాడు. వాని బ్రతికివుంటే రవీంద్ర అంత ఉండే వాడు అనుకున్నాడు కాంతారావు.

సిగరెట్ చివరంటా కాల్చి కిటికీలో గుండా బైటకు విసిరివేశాడు. చల్లటి గాలి విసురు ఎక్కువైంది. బస్‌రొద. కిటికీ అద్దం క్రిందకుదించి కళ్ళుమూసుకున్నాడు.

అరగంట తర్వాత ఉలిక్కిపడి లేచాడు కాంతారావు. రవీంద్ర రెండు చేతులతో ముఖం కప్పుకుని చిన్నగా వెక్కివెక్కి ఏడుస్తున్నారు.

కాంతారావు రవీంద్ర చేతులు పట్టుకుని "ఏమైంది తమ్ముడూ" అన్నాడు.

"ఏమీ లేదండీ" అన్నాడు రవీంద్ర ఏడుపు ఆపుకోడానికి విఫలప్రయత్నం చేస్తూ.

"లేదు. నువ్వేదో బాధ పడుతున్నావు. చెప్పు. ఏమైంది?"

రవీంద్ర మాట్లాడలేదు.

"చెప్పకూడని విషయం అయితే చెప్పకు." అన్నాడు కాంతారావు.

రవీంద్ర పెదాలు మెల్లగా కదిపి ఏదో చెప్పబోయాడు. ఆగి కర్చీఫ్‌తో కళ్ళు అద్దుకున్నాడు. దుఃఖం ఆగడంలేదు. తిరిగి పెదాలు కదిపాడు. క్రింది పెదవిని మునిపంటితో నొక్కిపట్టాడు.

ఒక్క కుదుపుతో బస్సు ఆగింది. లైట్లు వెలిగాయి.

"ఇక్కడ బస్సు ఇరవై నిమిషాలు ఆగుతుందండీ. టీ, సోడాలు తాగేవాళ్లు ఎవరేనా ఉంటే త్రాగొచ్చు." అన్నాడు కండక్టరు.

"పద. టీ త్రాగుదాం" అన్నాడు కాంతారావు.

రవీంద్ర లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ బస్సు దిగి టీ స్టాలులోకి వచ్చి టీలు చెప్పి ఒకమూల కూర్చున్నారు టీలు వచ్చాయి. టీ త్రాగి సిగరెట్ వెలిగించాడు కాంతారావు. నల్లుల వాసన వేస్తోంది. గదిలో ఉక్కగా ఉంది. కాంతారావు డబ్బు లిచ్చాడు ఇద్దరూ బైటకు వచ్చారు. చల్ల గాలి వీస్తోంది. రవీంద్ర ముఖంలో విచారం తగ్గలేదు. క్షణక్షణానికీ అధికమతున్నట్లుగా ఉంది.

"మా మామయ్యకు మేమంటే పడదండీ. ముందు నన్నూ, అమ్మను, అన్నయ్యను బాగానే చూసేవారండీ, కాని ఉన్నట్టుండి మారిపోయాడు." అన్నాడురవీంద్ర.

"ఎందుకు?"

"ఎందుకో తెలీదండీ మునుపు హిమాయత్ నగర్‌లో మాఇంటి ప్రక్కనే ఉండేవాళ్ళు. ఈమధ్యనే మా మామయ్యకు, గుంటూరు ట్రాన్స్‌ఫర్ అయింది. వెళ్లిపోయేప్పుడు మామయ్య మా అమ్మను, ఎందుకో తిట్టాడు. అన్నయ్యకు అందుకు కోపం వచ్చి మామయ్యను దులిపేడు. దాంతో ఆయనకు కోపం వచ్చి అన్నయ్యను మెడపెట్టి వాళ్ల ఇంట్లోంచి బైటకు గెంటివేసాడు. అప్పట్నుండి మేము మామయ్య వాళ్ల ఇంటికి వెళ్లేవాళ్లం కాదు. కాని మాలతి వదిన మామయ్యకు తెలీకుండా అప్పుడప్పుడు వస్తుండేది. అసలు మాలతి వదినను మా అన్నయ్యకు ఇద్దామనుకున్నారండీ. ఆ వదినకూ మా అన్నయ్య అంటే ఇష్టమే. నాలుగురోజుల క్రిందటే తనకీ పెళ్లి అసలు ఇష్టంలేదని అన్నయ్యకు ఉత్తరం రాసింది...."

"ఈపెళ్లికినువ్వొక్కడివేవెడుతున్నావేం?"

"మా అమ్మగారికి వంట్లో బావోలేదు"

"మీ అన్నయ్య..."

"అన్నయ్యను చూస్తుంటే ఏడుపొస్తుందండీ..."

"ఎందుకు?"

"మాలతి వదిన పెళ్లి కార్డు అందిన దగ్గర్నుండి ఎప్పుడూ దిగాలుగా ఇంట్లో కూర్చుంటాడు. ఎక్కడికీ కదలడు. ఆఫీసుకు సెలవు పెట్టాడు. మా ఇంట్లో ఎవరూ వెళ్లకపోతే బావుండదని నన్ను మా అమ్మ పంపిస్తున్నారు"

"మరి నీకు గుంటూరు బాగా తెలుసా?"

రవీంద్ర తలూపాడు.

కారు హారన్ మ్రోగింది.

ఇద్దరూ బస్సులోకి వచ్చి కూర్చున్నారు. అందరూ వచ్చాక బస్సు కదిలింది. ఏదో గుర్తుకు వచ్చినట్లు జేబులోంచి పెళ్లి కార్డు తీసికాంతారావుచేతిలోపెట్టాడురవీంద్ర.

"ఇదేనండీ" అన్నాడు రవీంద్ర.

సన్నటి వెలుతురులో ఆకార్డును చూశాడు బస్సు కుదుపుకు కార్డు చేతిలోంచి జారి క్రిందబడింది. అందుకుని చదివాడు. కాంతారావు ఆలోచనలన్నీ ఆగిపోయాయి. తిరిగి ఆ కార్డు రవీంద్ర చేతి కందిస్తుంటే చేతులు వొణికాయి.

తెలతెలవారుతుండగా బస్సు విజయవాడ చేరింది.

"ఏమిటండీ ఇక్కడ దిగిపోతున్నారు—గుంటూరు వస్తానన్నారు" ఎటాష్‌కేస్ పట్టుకుని దిగిపోతున్న కాంతారావును ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు రవీంద్ర.

"నాకు చిన్న పనుంది తమ్ముడూ. ఎనిమిది గంటల బస్సులో వస్తాను." అని దిగిపోయాడు కాంతారావు.

బాగా తెల్లవారింది విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్లే బస్సు సిమెంట్ రోడ్డుమీదవేగంగాజారిపోతుంది. పచ్చటిపొలాలు వంతులేసుకుని తోడుగా పరుగెడుతున్నాయి.

చివరంటా కాలిన సిగరెట్ కిటికీలో గుండా బైటకు విసిరి సీటుకు చేరగిలబడ్డాడు కాంతారావు. నిద్ర వస్తోంది. మత్తుగా ఉంది. కళ్లు మంటలుగా ఉన్నాయి. కళ్లు మూసుకున్నాడు అమ్మా, నాన్న, బంధువులు అంతా ఆలోచనల్లో బరువుగా ఊగుతున్నారు. వీళ్లంతా తన కోసం ఎదురు చూస్తుంటారు తను రాడు. చూసి? అంతకన్న ఎక్కువ ఆలోచించలేకపోయాడు. రవీంద్ర గుర్తుకు వచ్చాడు. కళ్లు తెరిచాడు వాచీ చూసుకున్నాడు. ఏడూ ఇరవై అయింది ముందుకు వంగి సీటు క్రిందున్న ఎటాష్ కేస్ మూత తెరిచి పైనున్న కవరు తీశాడు. కవరులో నాలుగు పెళ్లి కార్డులున్నాయి. నాలుగుమూలలా పసుపు రాసి. ఒకకార్డు తీశాడు తన పేరు ఎదురుగా మాలతి పేరు ఉంది. మధ్య గీత ఉంది. నాలుగు కార్డులు కలిపాడు ఒకసారి పరీక్షగా చూశాడు. మధ్యగా చింపాడు. ఆ ఎనిమిది ముక్కలను పదహారు, ఆ తర్వాత ముప్పైరెండు చేశాడు. కిటికీలో గుండా బైటకు విసిరాడు. ముక్కలన్నీ గాలిలో తేలి రోడ్డు మీద చెల్లాచెదురుగా పడిపోయాయి. ఒక ముక్క కిటికీ అద్దానికి కొట్టుకుని అలానే రెండు క్షణాలు అంటిపెట్టుకుని గాలికి టపటప లాడి జారి కాంతారావు జేబులో పడింది. తీశాడు. దాని మీద 'మాలతి' అని ఉంది.